సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ; 15 ; నవంబర్ ; 2023



ప్రాణం తీసిన తొందరపాటు

ఓ విద్యార్థి బస్సు ఎక్కే ప్రయత్నంలో కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. సోంపేటలో ఘటన జరిగింది. - 8లో



గ్రంథాలయ వారోత్సవాలు..

జిల్లావ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. - 8లో

24న ఆదిత్యుని హంసనావికోత్సవం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హంసనావికోత్సవం (తెప్పోత్సవం) ఈనెల 24న పవిత్ర ఇంద్ర పుష్కరిణిలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఆలయ పరిసరాల్లోనూ, ఇంద్రపుష్కరిణి ఆవరణలోనూ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

న్యూస్‌రీల్

సమరోత్సాహంతో సామాజిక సాధికార యాత్ర

పోలాకి: నరసన్నపేటలో బుధవారం సమరోత్సాహంతో సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామని, ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మబగాంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1.30 గంటలకు మబగాం నుంచే బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. మబగాం, కిల్లాం, ఈదులవలస, ఈదులవలస జంక్షన్, చల్లబంద జంక్షన్ దాటుకుని నరసన్నపేట పట్టణంలోకి బస్‌యాత్ర చేరుకుంటుందని చెప్పారు. దేశవానిపేట, పల్లిపేట జంక్షన్ మీదుగా వైఎస్సార్ కూడలికి చేరుకున్నాక అక్కడ దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సమావేశం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

గిరిజనుల్లో పులి భయం



జీడిపేట సమీపంలో గల జీడిరాయిల మెట్టపై ఉన్న పులి

టెక్కలి రూరల్: కొన్ని రోజులుగా జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి ఐదురోజుల కిందట టెక్కలి మండలం డమర రిజర్వ్ ఫారెస్ట్ కొండలోకి ప్రవేశించినట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు. మంగళవారం మేఘవరం పంచాయతీ పరిధి జీడిపేట గ్రామ సమీపంలోని జీడిరాయల మెట్టపై నిలబడి ఉన్న పులిని అక్కడి ప్రజలు గుర్తించారు. అనంతరం అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న అటవీ శాఖాధికారులు పులిని గుర్తించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే కొండపై పులి ఉండడంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. ఆ కొండకు ఆనుకుని భీంపురం, చిన్న భీంపురం, జక్కరపేట, జీడిపేట, కోదండపురం, సరియాపల్లి, డెప్పూరు, కొండమీద కొత్తూరు, దబ్బగుడ్డి, చిన్నకేదారి, పెద్దకేదారి గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం పరిధిలో కొన్ని గ్రామాలు ఉన్నాయి.

కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం

పెద్దపులి జాడ కనిపించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో బయటకు వెళ్లరాదని అటవీ శాఖాధికారులు ప్రజలను సూచించారు. పశువులను బయట ప్రాంతాల్లో కట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలానే పులి సంచరించే ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, టెక్కలి, మెళియాపుట్టి ప్రాంతాల్లో దండోరా వేయించనున్నట్లు అటవీ శాఖాధికారి తెలిపారు.

కిడ్నీ పరిశోధన కేంద్రం పరిశీలన



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధరరెడ్డి


కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధరరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఉదయం పదకొండు గంటలకు ఉన్నతాధికారులు, వైద్యులు, ఇంజినీరింగ్ బృందాలతో ఆయన గ్రౌండ్ ఫ్లోర్, ఆపరేషన్ థియేటర్, సిటీ స్కాన్, ల్యాబ్‌లు చూశారు. పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న నెఫ్రోప్లస్ డయాలసిస్ కేంద్రాన్ని మార్చే గదిని పరిశీలించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితిలో ఉన్న కిడ్నీ బాధితులకు సేవలు అందించే ప్రత్యేకమైన బ్లాక్‌లవద్ద ఉన్న మిషనరీలను చూశారు. సీఎం పర్యటనకు సంబంధించి అంశాలను ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం కొన్ని విభాగాల్లో మిషనరీలు ఏర్పాటు చేయకపోవడం, పరిశుభ్రత కార్యక్రమాలు ఇంకా సిద్ధం చేయకపోవడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం టూర్ షెడ్యూల్ ఖరారైన వెంటనే మళ్లీ వస్తానని, ఆ లోగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం మొదటి, రెండు, మూడో అంతస్తులు తిరిగి పలు సూచనలు సలహాలు అందించారు. కలెక్టర్ నియమించిన ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఏపీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ శివప్రసాద్, డీసీహెచ్ఎస్ భాస్కరరావుతో పాటు అన్ని విభాగాల డీఈలు, జేఈలు, ఏఈలు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది.

పేట.. ప్రగతి బాట

పాలనలో భాగస్వామ్యం లేక అడుగున ఉండిపోయిన బడుగు వర్గాల వారికి పదవులు, ఆలనా పాలనా చూడక అన్యాయమైపోతున్న ఊరికి నిధులు, నాయకులు పట్టించుకోక అధ్వానమైపోయిన దారులకు పనులు.. నరసన్నపేటలో వైఎస్సార్ సీపీ పాటించిన సామాజిక, సంక్షేమ సూత్రమిది. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తూనే.. నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులకు సర్కారు దండిగా నిధులు అందించింది. కొత్త దారులు, వంతెనలే దీనికి నిదర్శనం. ఈ మేలును జనులకు వివరించేందుకు నేడు అక్కడ వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్నారు.



- నరసన్నపేటలో రూ. 1400కోట్లతో సంక్షేమ పథకాలు
- మరో రూ. 500కోట్లతో నాన్ డీబీటీ పథకాలు
- రూ.500 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి పనులు
- నేడు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: నరసన్నపేట సామాజిక న్యాయానికి సాక్షిగా నిలిచింది. సంక్షేమ స్వరాజ్యానికి ఓ ఉదాహరణగా నిలబడింది. నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఇక్కడ బడుగు వర్గాల ప్రతినిధులు రాజ్యాధికారంలో భాగస్వాములయ్యారు. మధ్యవర్తులతో పనిలేకుండా, లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా పేదల ఇంటి ముంగిటకే సంక్షేమం అందించారు. ప్రజలకు అందిసున్న సంక్షేమం, బడుగు, బలహీన వర్గాలకు అధికారం అప్పగించిన తీరును ప్రజలకు తెలియజేసేందుకు బుధవారం నరసన్నపేటలో సామాజిక సాధికార బస్సు యాత్రను వైఎస్సార్ సీపీ నిర్వహిస్తోంది.

పాలనలో భాగస్వామ్యం..

నరసన్నపేటలో వెనుకబడిన వెలమ సామాజిక వర్గానికి చెందిన ధర్మాన కృష్ణదాస్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎమ్మెల్యేగా చేసింది. డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చింది. ఈ ప్రాంతానికి చెందిన మహిళ వరుదు కల్యాణికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. ఇదే ప్రాంత వాసి, తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన కరిమి రాజేశ్వరరావును డీసీసీబీ చైర్మన్‌గా నియమించింది. కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన కోరాడ ఆశలతను శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా చేసింది. పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా రాజాపు హైమావతిని నియమించింది. పోలినాటి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పంగా కృష్ణవేణిని నియమించింది. కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు దాదాపు పదిమందికి ఇచ్చారు. ఇలా బడుగు వర్గాల ప్రతినిధులను పాలనలో భాగస్వాములను చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

అర్హులకు అండగా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచింది. ఒక్క పైసా అవినీతికి తావులేకుండా కోట్లాది రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ఇందులో 90 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చేరాయి. నియోజకవర్గంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద దాదాపు రూ.1400కోట్ల వరకు సంక్షేమ పథకాలకు కింద జమ చేశారు. నాన్ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద ఇళ్ల స్థలాలు, గోరుముద్ద, జగనన్న తోడు రుణాలు, రేషన్, ట్యాబ్‌లు పంపిణీ, విద్యా కానుక, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసమని మరో రూ.500కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇక, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల ఆధునీకరణ, విలేజ్ హెల్త్ క్లీనిక్, వెటర్నరీ క్లినిక్‌లు, రోడ్లు, వంతెనలు తదితర వాటికి రూ.500 కోట్లు ఖర్చు చేసింది.

పలు అభివృద్ధి కార్యక్రమాలు..

- జలుమూరు మండలం కొమనాపల్లిలో రూ.42కోట్లతో కీలకమైన వంతెన నిర్మాణం చేశారు.
- నియోజకవర్గంలో గడిచిన నాలుగున్నరేళ్లలో పంచాయతీ రాజ్ కింద 50 కిలోమీటర్ల పరిధిలో సీసీ రోడ్లు నిర్మించారు. ఒక్కో కిలో మీటర్‌కు రూ. 48 లక్షలు వెచ్చించారు. నియోజకవర్గం మొత్తం రూ.24 కోట్లు ఖర్చు చేశారు.
- నియోజకవర్గంలో రూ.52కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు అభివృద్ధి చేశారు.
- నరసన్నపేటలో వంద పడకల ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి రూ.12.8 కోట్లు మంజూరు చేశారు. పనులు జరుగుతున్నాయి. 20 మంది వైద్యులను నియమించారు.
- బుడితిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు.
- నియోజకవర్గంలో 195 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రూ.66.69కోట్ల వరకు ఖర్చు చేశారు.
- రూ.50కోట్లతో చల్లపేటలో జగనన్న లేవుట్‌ను మోడల్ కాలనీగా నిర్మాణం చేపట్టి ప్రారంభించారు.
- నరసన్నపేట టౌన్‌లో రూ.4.5కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.
- నియోజకవర్గంలో 83 లేఅవుట్లు వేసి, 3200 ఇళ్లు నిర్మిస్తున్నారు.
- కొత్త సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి.





జలుమూరు మండలంలోని చల్లవాని పేట వద్ద సకల వసతులతో నిర్మించిన జగనన్న మోడల్ కాలనీ (ఇన్‌సెట్లో) నరసన్నపేటలో రూ.12 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వాస్పత్రి



సంక్షేమ సమాచారం..

పథకం పేరు	నరసన్నపేట లబ్ధిదారులు	నరసన్నపేట సొమ్ము	పోలాకి లబ్ధిదారులు	పోలాకి సొమ్ము	జలుమూరు లబ్ధిదారులు	జలుమూరు సొమ్ము	సారవకోట లబ్ధిదారులు	సారవకోట సొమ్ము
అమ్మఒడి	8273	28,65,82,041	3896	14,56,85,234	6303	24,05,10,865	2087	8,74,87,272
చేదోడు	749	1,53,30,000	580	1,39,66,169	454	96,41,000	156	37,56,417
వాహన మిత్ర	498	1,43,60,000	285	1,43,89,364	460	1,37,26,000	174	87,85,085
జగనన్న వసతి దీవెన	7443	21,17,60,690	2800	3,01,55,320	4275	5,78,59,506	1421	1,53,03,825
జగనన్న విద్యాదీవెన	6590	16,29,30,000	2920	5,83,19,592	5212	11,51,25,389	985	1,96,72,876
వైఎస్సార్ చేయూత	6743	49,89,82,000	6800	55,87,52,848	5655	24,90,56,250	1413	11,61,05,555



వంశధార నదిపై కొమనాపల్లి వద్ద నిర్మించిన వంతెన

డిసెంబర్ నాటికి వంశధార రిజర్వాయర్ పూర్తి

- ఉత్తరాంధ్ర ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సుగుణాకర రావు

హిరమండలం: వంశధార జలాశయం (రిజర్వాయర్) పనులు డిసెంబర్ ఆఖరుకు పూర్తవుతాయని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ (సీఈ)ఎస్.సుగుణాకరరావు అన్నారు. ఇటీవల ఏఈ, జేఈలుగా ఎంపికైన యువ ఇంజినీర్లు సీఈ, ఎస్సీ కార్యాలయాల్లో వివిధ అంశాల్లో పనిచేస్తున్న సాంకేతిక బృందాలు మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా వంశధార రిజర్వాయర్, గొట్టా బ్యారేజీలను పరిశీలించారు. స్పిల్‌వే, హెడ్ రెగ్యులేటర్ బ్రిడ్జి, గట్టు నిర్మాణం, రాతి పేర్పు, హైలెవల్ కెనాల్‌తో పాటు రిజర్వాయర్‌లో నీటిని నింపేందుకు జరుగుతున్న ఎత్తిపోతల పథకం పనులు, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టులను గమనించారు. అనంతరం వారికి వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, ఈఈ ఎస్వీ రమణలు రిజర్వాయర్ ఆవశ్యకత, రిజర్వాయర్ నిర్మాణంలో ఎదురైన సమస్యలు, నదుల అనుసంధానానికి హైలెవల్ కెనాల్ ఉపయోగం, ఉద్దానం ప్రాంతానికి వెళ్లే తాగునీరు వంటి అంశాలపై వివరించారు.

అనంతరం సీఈ విలేకరులతో మాట్లాడుతూ వంశధార రిజర్వాయర్‌లో 96 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. మరో నాలుగు శాతం పనులు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచుతామన్నారు. వానలు లేకపోవడంతో నాలుగైదు టీఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ రబీ సీజన్‌కు నీరు ఇచ్చే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి మట్టం అడుగంటిపోయే దశలో ఉందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జూన్ నాటికి పూర్తిచేస్తామన్నారు. దాని ద్వారా ఖరీఫ్ నాటికి పూర్తి స్థాయిలో నీరు అందజేస్తామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రిజర్వాయర్ నుంచి 1.2 టీఎంసీ నీరు ఉద్దానం ప్రాంత ప్రజలకు అందజేస్తామన్నారు. 2025 నాటికి పూర్తి స్థాయిలో 19 టీఎంసీల నీటిని నింపి జిల్లాలో రెండు పంటలు పండించడానికి సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఈ స్వర్ణకుమార్, ఈఈ ప్రదీప్, సీతారాంనాయుడు, డీఈలు రవికాంత్, ధనుంజయరావు, సునీల్, గణేష్ సోమా ప్రతినిధి శ్రీనివాసరావు, వంశధార సిబ్బంది పాల్గొన్నారు.



వంశధార రిజర్వాయర్ హైలెవల్ కెనాల్‌ను పరిశీలిస్తున్న సీఈ ఇంజినీర్ల బృందం

క్లుప్తంగా

చిన్నారుల వైద్యానికి దంపతుల ఆర్థిక సాయం



చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం చేస్తున్న దంపతులు దున్న కూర్మారావు, తేజేశ్వరి

ఇచ్ఛాపురం రూరల్: బోన్‌మేరో వ్యాధితో బాధ పడుతున్న కవల పిల్లలు శివంగి హర్షవర్ధన్, హర్షితల వైద్యం కోసం మంగళవారం డొంకూరు గ్రామానికి చెందిన దున్న కూర్మారావు, తేజేశ్వరి దంపతులు సాయం చేశారు. వారు మంగళవారం కేశుపురం గ్రామానికి వెళ్లి చిన్నారుల వైద్యానికి కుటుంబ సభ్యులకు రూ.10వేలు నగదు అందజేశారు. చిన్నారుల పరిస్థితికి చలించిపోయామని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి చిన్నారుల శస్త్ర చికిత్సకు సాయంగా నిలవాలని వారు కోరారు.

ప్రభాకరరావునాయుడు మృతికి సంతాపం



అట్టాడ ప్రభాకరరావునాయుడు సంతాపసభలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నందిగాం: నందిగాం పంచాయతీ పెంటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, రైస్‌మిల్ ఓనర్ అట్టాడ ప్రభాకరరావునాయుడు మృతిపై ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం పెంటూరులో జరిగిన ప్రభాకరరావు నాయుడు సంతాప సభలో వారు పాల్గొని నాయుడు చేసిన సేవలను కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని తెలుపుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బెండి దుర్గా మనోహర్, ఆరంగి శ్రీనివాస్, చిన్ని జోగారావు, అట్టాడ రమేష్, పిన్నింటి అజిత్, అట్టాడ సీతారాం,పొందూరు పాపారావు, గున్న జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి'



విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

సారవకోట: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని చిన్నగుజ్జువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సేవలపై ఆరా తీశారు. కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అన్నుపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయనతో పాటు తహసీల్దార్ హనుమంతరావు, ఏఓ వెంకటరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, సర్పంచ్ కొండాల బాబూరావు తదితరులు ఉన్నారు.

కార్డ్‌ప్రైమ్ 2.0 తొలిరోజు 98 రిజిస్ట్రేషన్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలు రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులువుగా డాక్యుమెంట్లు తయారు చేసుకునేందుకు కొత్తగా కార్డ్‌ప్రైమ్ 2.0ను మంగళవారం నుంచి అమలులోకి తీసుకువచ్చారని జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 98 డాక్యుమెంట్లు నూతన విధానంలో రిజిస్ట్రేషన్లు చేశారు. డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు కార్డ్‌ప్రైమ్ విధానానికి సహకరించి సులువుగా రిజిస్ట్రేషన్లు చేసుకుని వ్యయప్రయాసలు తగ్గించుకోవాలని కోరారు. తొలి రోజు శ్రీకాకుళం 27, పొందూరు 16, ఇచ్ఛాపురం 12, టెక్కలి 10, కాశీబుగ్గ 9, నరసన్నపేట 8, ఆమదాలవలస 7, కోటబొమ్మాళి, మందస, పాతపట్నంలలో రెండేసి, హిరమండలం, రణస్థలం, సోంపేటల్లో ఒక్కటి చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి. సందేహాలుంటే నేరుగా జిల్లా రిజిస్ట్రార్, కార్యాలయ నెంబర్ 08942-279422లను సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో ద్విచక్ర వాహనం చోరీ

టెక్కలి రూరల్: స్థానిక వంశధార ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పట్నాన రమేష్ బైక్‌ను ఎవరో దొంగిలించారు. బైక్‌ను ఎప్పటిలాగానే మంగళవారం పాఠశాల బయట పార్క్ చేసి లోపలకు వెళ్లానని, 11 గంటల సమయంలో బయటకు వచ్చి చూస్తే బండి అక్కడే ఉందని ఆయన చెప్పారు. మళ్లీ మధ్యాహ్నం 1 గంట సమయంలో బండి కనిపించలేదని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

● ఆబాలగోపాలం మెచ్చేలా..



ఇచ్ఛాపురం బెల్లుపడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అలరించిన చిన్నారుల వేషధారణలు



కవిటి: గొర్లెపాడులో నెహ్రూ చిత్రపటం వద్ద కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

జిల్లావ్యాప్తంగా మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యాలయాల్లో పిల్లలు దేశనాయకుల వేషధారణల్లో అలరించారు. పండిట్ నెహ్రూ సేవలను గుర్తు చేసుకుని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

'సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు'



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కళింగ వైశ్య సంఘ పెద్దలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. శ్రీకాకుళంలోని కళింగ వైశ్య కల్యాణ మండపంలో కళింగ వైశ్యులంతా సంఘ నగర అధ్యక్షులు ఉణ్ణ నాగరాజు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ జీఓ నెంబరు 25 ప్రకారం 26 జిల్లాల్లో ఉన్న కళింగ వైశ్యులందరికీ బీసీల్లో చేర్చిన సీఎంకు రుణపడి ఉంటామన్నారు.

సంఘ పెద్దలతో పాటు ముందుండి నడిపించిన విజయ్‌సాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసుల కృషి మరువరానిదన్నారు. కార్యక్రమంలో అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్, బరాటం శ్రీనివాసరావు, వడ్డీ ప్రతాప్, కిల్లంశెట్టి అరుణ్‌గుప్తా, గుడ్ల దాము, కె.వి.మాస్టర్, గుడ్ల మల్లేశ్వర్రావు, అంధవరపు మనోజ్, కళ్యాణచక్రవర్తి, నాగభూషణం, శిల్లా వైకుంఠరావు, గోవిందరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా జెండా ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ

శ్రీకాకుళం అర్బన్: ప్రజల తలరాత మార్చేది అక్షరమేనని అని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సువ్వారి సువర్ణ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జవహర్ లాల్ నెహ్రూ 134వ జయంతి సందర్భంగా విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బాలల కోసం గ్రంథాలయ వారోత్సవాలు జరపడం శుభ పరిణామన్నారు. వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆమె కోరారు.

గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించి గ్రంథాలయానికి రావాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా 14వ తేదీన బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనల ఏర్పాటు, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, తదితర వారిని స్మరించడం, 17న కవితా దినోత్సవం, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడల పోటీలు ఉంటాయన్నారు. 19న మహిళా దినోత్సవం, ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాలు, 20న అక్షరాస్యతా దినోత్సవం, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయని వివరించారు. ముందుగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాలమాన్ సింగ్, వైయస్సార్ సీపీ నాయకులు సువ్వారి సత్యనారాయణ (డిల్లీ), డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డా.ఇ.ఎస్.సంపత్ కుమార్, ఉప గ్రంథాలయ అధికారి వి.వి.జి.ఎస్.శంకర్‌రావు, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఐసెట్ -2023(ఎంబీఏ, ఎంసీఏ) ప్రవేశాల తుది విడత (రెండో విడత) కౌన్సెలింగ్ బుధవారం నుంచి జరగనుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసింది. 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 18వరకు ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహిస్తారు. 19వ తేదీలోపు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవల్సి ఉంటుంది. 20వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తారు. 22న సీట్లు కేటాయిస్తారు.

23న విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు ఉంటే విద్యార్థులు మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహిస్తున్నారు. మరో మూడు ప్రైవేట్ కళాశాలలు సైతం ఎంబీఏ కోర్సు నిర్వహిస్తున్నాయి.

స్టేషన్లలో శిక్షణ పొందేందుకు..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో కొన్ని రోజులపాటు వివిధ పోలీస్ స్టేషన్లు, సర్కిల్, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో శిక్షణ పొందేందుకు ప్రొబెషనరీ డీఎస్పీ చప్పిడి రాజా మంగళవారం జిల్లాకు చేరుకున్నారు. ప్రాక్టికల్ ట్రెనింగ్ భాగంగా జిల్లాకు ఈయన వచ్చారు. ఈ మేరకు ఎస్పీ రాధికను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధి లక్ష్యంగా సిలబస్ : వీసీ



ఐటీఈపీ కోర్సు డిజైన్‌పై చర్చిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల ఉజ్వల భవితతో పాటు ఉపాధి లక్ష్యంగా కోర్సులు, సిలబస్ రూపకల్పన జరగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తున్న నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం డిజైన్, అండర్ గ్రాడ్యుయేషన్ కామన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమీక్ష సమావేశాలు మంగళవారం నిర్వహించారు. జాతీయ నూతన విద్యా విధానం-2020ను దృష్టిలో పెట్టుకొని మార్పులు చేయాలన్నారు. ఐటీఈపీ కోర్సు నాలుగేళ్లు ఉంటుందని అన్నారు.

మొదటి ఏడాది సర్టిఫికెట్ కోర్సు, రెండో ఏడాది డిప్లమా కోర్సు, మూడో ఏడాది డిగ్రీ, నాలుగో ఏడాది డిగ్రీ+ బీఎడ్ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది బీఎస్సీ+బీఎడ్‌లో గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, బీఏ+ బీఎడ్‌లో చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రంలతో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మొత్తం ఎనిమిది సెమిస్టర్లలో 7, 8 సెమిస్టర్లలో బీఎడ్ సిలబస్ ఉంటుందన్నారు. డిగ్రీలో ఇంటర్న్‌షిప్ అమలు తప్పనిసరని వివరించారు. కార్యక్రమంలో రిజస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, విద్యారంగ నిపుణులు గంటా రమేష్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాత, అకడమిక్ అఫైర్స్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ నీలం సంతోష్ రంగనాథ్ పాల్గొన్నారు.

16న శివానీ కాలేజ్‌లో జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం శ్రీ శివానీ ఫార్మసీ కాలేజ్‌లో ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కిరణ్ చెప్పారు. కళాశాలలో మంగళవారం వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం, హైదరాబాద్‌కు చెందిన అరబిందో, ఎంఎస్ ల్యాబ్స్, న్యూ ల్యాండ్ లేబొరేటరీస్ ఎంపికలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నం స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో 45 నుంచి 60 రోజుల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ అనంతరం కంపెనీలు ఉద్యోగావకాశం కల్పిస్తాయని, విద్యార్హత, నైపుణ్యం బట్టి రూ. 12,500 నుంచి రూ. 20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. బీ ఫార్మా, డీఫార్మా, బీఎస్సీ కెమిస్ట్రీ, బీటెక్, ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు చదివిన వారు అర్హులని తెలిపారు. 25 ఏళ్ల లోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు విద్యార్థులు 9949106729 ఫోన్ నంబర్ సంప్రదించాలని సూచించారు.

పశుసంవర్ధక శాఖ అధికారుల నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పశుసంవర్ధక శాఖ అధికారుల నూతన కార్యవర్గం ఎన్నిక డాక్టర్ మనోజ్‌కుమార్, ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా మంగళవారం జరిగింది. ఈ నూతన కార్యవర్గంలో సంఘ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కె.రాజగోపాల్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.రవికృష్ణ, ఎం.లోకనాథం, ప్రధానకార్యదర్శులుగా డాక్టర్ పి.చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా బి.దుర్గారావు, ట్రెజరర్‌గా ఆర్.ఆనందరావు ఎన్నికయ్యారు. సంఘ నూతన అధ్యక్షులు రాజగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానన్నారు.

'పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ ప్రతినిధులు కోరారు. శ్రీకాకుళం సబ్ ట్రెజరీ పరిధిలోని పింఛన్‌దారులతో సమన్వయ సమావేశం శ్రీకాకుళం సబ్ ట్రెజరీలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పింఛన్‌దారులు పలు సమస్యలను ఎస్టీఓ దృష్టికి తీసుకెళ్లారు. శ్రీకాకుళం జిల్లా ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, సంఘ ప్రతినిధులు బి.మోహనరావు, తవిటినాయుడు, సోమసుందరరావు, నరసింహమూర్తి, రాధాప్రసాద్ మాట్లాడుతూ డేట్ ఆఫ్ బర్త్‌లో తప్పుల వల్ల అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ రావడం లేదని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. పెన్షనర్ల సమస్యలపై సబ్ ట్రెజరీ అధికారి సూర్యారావుకు వినతి పత్రం అందజేశారు. తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

వైన్ షాప్ వద్ద వీరంగం

రణస్థలం:

రావాడ వైన్‌షాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో వీరంగం వేశారు. వీరు సృష్టించిన బీభత్సంలో చాలా మంది గాయపడి ఆస్పత్రుల్లో చేరారు. ఆఖరుకు స్థానికులు వారిద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని రావాడ వైన్ షాప్ వద్ద పిన్నింటి చంటి, సురేష్‌లు దారినపోయిన వారిపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. వీరిద్దరూ అన్నదమ్ములు. కృష్ణాపురం కూడలిలో నివాసం ఉంటున్నారు. ఒకరికి వివాహమైంది. భార్యతో తరచూ గొడవపడి పోలీస్ స్టేషన్‌కు వెళ్తుంటారని స్థానికులు చెబుతున్నారు. వీరిద్దరూ మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో రావాడ మద్యం దుకాణం వద్ద పూటుగా మద్యం సేవించి అటుగా రాకపోకలు సాగిస్తున్న రావాడ, లంకపేట, సీతారాంపురం గ్రామాలకు వెళుతున్న వారిపై దాడికి దిగారు. వీరి వీరంగంతో చాలామంది గాయపడ్డారు. లంకపేట గ్రామానికి చెందిన లక్ష్మం నాయుడుకు తీవ్ర రక్తస్రావమైంది. దీంతో స్థానికులు దాదాపు వంద మంది ఏకమై వీరిద్దరికీ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మద్యం మత్తులో వీళ్లు పడిపోవడం వల్ల తలకు దెబ్బతగలడంతో కొండములగాం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు.

ప్రాణం తీసిన తొందరపాటు

● బస్సు కింద పడి విద్యార్థి మృతి



సాయికుమార్ బెహరా

సోంపేట: పట్టణంలోని కుమార్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయికుమార్ బెహరా బస్సు ఎక్కాలనే తొందరపాటుతో పట్టు తప్పి పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, తోటి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుంకిడి పంచాయతీ కొరంజి భద్ర గ్రామానికి చెందిన రామారావు బెహరా, రేవతి బెహరాల కుమారుడు సాయికుమార్ పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ ఉదయం సాయంత్రం బస్సుపై వెళ్లి వస్తుంటాడు. మంగళవారం సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి వెళ్లేందుకు సోంపేట కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. అయితే బస్సు ఆగకుండా ఎక్కేందుకు ప్రయత్నించడంతో పట్టుతప్పి కింద పడిపోయాడు. అతనిపై నుంచి టైరు వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు విద్యార్థిని సోంపేట సామాజిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలిస్తుండగా యువకుడు మృతి చెందాడు. విద్యార్థి తల్లిదండ్రులు తాపీ పని చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. విద్యార్థి మృతితో సుంకిడి పంచాయతీ కొరంజి భద్ర గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోంపేట ఎస్ఐ హైమావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ శిలగాన భాస్కరరావు తదితరులు కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

అప్రెంటిస్ మేళాలో 51 మంది ఎంపిక



అప్రెంటిస్ మేళాపై అవగాహన కల్పిస్తున్న కంపెనీల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో మంగళవారం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా(పీఎంఎన్ఏఎం) నిర్వహించారు.

ఈ మేళాకు జిల్లా నుంచి ఐటీఐ పూర్తి చేసిన 123 మంది హాజరు కాగా, వీరిలో ఇంటర్వ్యూల్లో 51 మంది ఎంపికయ్యారు. మేళాలో అరబిందో, ఆంధ్రా ఆర్గానిక్, స్మార్టెకెం, సాయసొమ్య, యునైటెడ్ బేవరేజెస్, నాగార్జున అగ్రికెం, ఈస్ట్‌కోస్ట్ రైల్వేస్‌తో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారులు విద్యాసాగర్‌రావు, కామేశ్వరరావు పర్యవేక్షించారు.

డాక్టర్ రమేష్‌కు ఘనంగా నివాళి



నివాళులు అర్పిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, సర్పంచ్ రత్నం బాలరాజు

వజ్రపుకొత్తూరు: దివంగత వైద్యుడు మడే రమేష్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన మంగళవారం అమలపాడు గ్రామంలో సర్పంచ్ దున్నరత్నం బాలరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్వర్గీయ మడే రమేష్ ప్రథమ వర్ధంతి సభలో పాల్గొన్నారు. రమేష్‌తో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మడే రమేష్ పలాస సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఎంతో బాధ్యతగా పని చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మడే రమేష్ చిత్రపటం వద్ద మంత్రితో పాటు గ్రామస్తులు నివాళులు అర్పించి అంజలి ఘటించారు. కార్యక్రమంలో రమేష్ భార్య డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, కుమార్తె ప్థైర్య, ఎంపీటీసీ దున్న ఆరుద్రమ్మ, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తొగరాం విద్యార్థుల సత్తా



కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు

ఆమదాలవలస రూరల్: తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తమ సత్తా చూపారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కళాశాలకు చెందిన రేగిడి జయలక్ష్మి, లింగంబెల్లి శ్రీదేవి, సబ్బి నీరజలు పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ బి.గోవిందరావు మూడు వేల రూపాయలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

● సుమనో'హర'ం

కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురంలోని శ్రీపంచధామ క్షేత్రం ఆవరణలో స్పటిక లింగాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ లింగాన్ని తిలకించి తన్మయులవుతున్నారు. ఆలయ ధర్మకర్త ఉప్పాడ కనకరాజు ఈ లింగాన్ని ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు దర్శనం చేసుకోవచ్చని తెలిపారు.

– కోటబొమ్మాళి

